క్లుప్తంగా

రేపు అంబేడ్కర్ జయంతి వేడుకలు

అమలాపురం టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను అమలాపురం గడియారం స్తంభం సెంటరులో ఈనెల 14న నిర్వహిస్తున్నట్టు జిల్లా దళిత ఐక్య వేదిక చైర్మన్, ఆర్‌పీఐ నాయకుడు డీబీ లోక్ తెలిపారు. స్థానిక సూర్యనగర్‌లో శుక్రవారం జరిగిన జిల్లా దళిత ఐక్య వేదిక ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌పీఐ, దళిత ఐక్యవేదిక, పీడీఎస్‌యూ, ఇతర ప్రజా సంఘాల సంయుక్తాధ్వర్యంలో జరిగే ఈ వేడుకలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. జిల్లా దళిత ఐక్య వేదిక కన్వీనర్ జంగా బాబూరావు, ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, ఐక్య వేదిక ప్రతినిధులు పెనుమాల చిట్టిబాబు, గెడ్డం సురేష్‌బాబు తదితరులు వేడుకల ఏర్పాట్లపై చర్చించారు.

దోమల నివారణకు పెద్ద ఫాగింగ్ యంత్రం



పెద్ద ఫాగింగ్ మెషీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మనోహర్

అమలాపురం టౌన్: పట్టణంలో పెరిగిపోయిన దోమల నిర్మూలనకు మున్సిపాలిటీ పూర్తి స్థాయిలో నడుం బిగించింది. కమిషనర్ ఎస్.మనోహర్ ఆధ్వర్యంలో నివారణ చర్యలు శుక్రవారం సాయంత్రం నుంచి మొదలుపెట్టారు. రూ.3.70 లక్షల వ్యయంతో కొత్తగా కొనుగోలు చేసిన రెండు గన్లతో కూడిన ఫాగింగ్ మెషీన్‌ను ఉపయోగించి 23, 24, 25 వార్డుల్లో పొగను వదిలారు. గతంలో ఉన్న ఫాగింగ్ మెషీన్లు తక్కువ కెపాసిటీతో, ఒక వర్కర్ వాడే పరిస్థితి ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన ఈ పెద్ద మెషీన్‌ను ఓ వాహనంలో ప్రత్యేకంగా అమర్చి, ఫాగింగ్ చేయడం ద్వారా దట్టమైన పొగలతో దోమల నిర్మూలన సులుభతరమవుతుంది. ఈ మెషీన్ కోసం ప్రత్యేక ఆటో త్వరలోనే సమకూర్చుతామని, ఈ లోగా ప్రత్యేక వాహనంలో ఫాగింగ్ మొదలు పెట్టినట్టు కమిషనర్ మనోహర్ తెలిపారు. ఇకనుంచి రోజూ సాయంత్రం ఈ మెషీన్ ద్వారా ఫాగింగ్ చేస్తారన్నారు.

అవుట్‌లెట్ డ్రైన్ల ప్రక్షాళన

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలోని పలు అవుట్‌లెట్ల డ్రైన్ల నుంచి మురుగు నీరు సక్రమంగా పారేలా ప్రక్షాళన చర్యలు చేపట్టారు. కమిషనర్ ఎస్.మనోహర్ ఆదేశాలతో పట్టణంలోని అవుట్‌లెట్ డ్రైన్ల పనులను పారిశుద్ధ్య సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. ప్రధాన డ్రైన్లలో చెత్త అడ్డుపడి మురుగు నీటి ప్రవాహం స్తంభించింది. ఆయా వార్డుల కౌన్సిలర్లు తమ వార్డుల పరిధిలో ప్రధాన డ్రైన్ల క్లియరెన్స్‌కు స్వీయ పర్యవేక్షణ చేస్తున్నారు. 28వ వార్డులోని డ్రెయిన్ అవుట్‌లెట్ క్లియరెన్స్ పనులు శుక్రవారం జరిగాయి. వార్డు కౌన్సిలర్ గోపి రాజి, వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు రమేష్ పర్యవేక్షించారు.

నేడు విశ్వరూప్ ఎన్నికల ప్రచారం

ఉప్పలగుప్తం: మండలంలోని సన్నవిల్లి, నంగవరం గ్రామాల్లో శనివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా శిఖర పునః ప్రతిష్ఠ



అమలేశ్వరస్వామి శిఖర పునఃప్రతిష్ఠ పూజలు చేస్తున్న రామారావు

అమలాపురం రూరల్: రోళ్లపాలెంలో వెలసిన అమలేశ్వరీదేవి సమేత అమలేశ్వరస్వామి ఆలయ శిఖర పునఃప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శైవాగమ పండితుడు నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాయుడు రామారావు, గంగా భవాని దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన జరిగింది.

ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణం.. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో రోగాల బారిన పడే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని ముక్కామల వైద్యాధికారి ఎ.ఇంద్రావతి అన్నారు. పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంద్రావతి మాట్లాడుతూ వేసవిలో వడగాడ్పులకు గురికాకుండా తగిన చర్యలు తీసుకుని జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

రంగోలీ సోడా

చెక్క చక్రాల బండి.. నీళ్ల చల్లిన గోనె పట్టాల కింద సీసాలు.. సోడా.. గోలీసోడా అంటూ అరుస్తూ, వీధివీధినా బండిని వేగంగా తోసుకుపోతున్న వ్యక్తి. సోడా కావాలని అడిగితే, కుయ్.. అనే శబ్దంతో గోలీని తప్పించి చేతిలో పెట్టే సీసా. కొందరైతే ఎత్తిన సోడా దించకుండా తాగి పొందే తృప్తికరమైన అనుభూతి. కొన్నేళ్ల క్రితం ఇదంతా జన జీవనంలో సాధారణ విషయం. వేసవి దాహాన్ని తీర్చుకునేందుకు చాలామంది అప్పట్లో గోలీసోడాపైనే ఆధారపడేవారు. ఇప్పుడు రోజులు మారాయి. గోలీసోడా రూపం కూడా మారింది. రూపాంతరం చెందిన గోలీసోడా ఇప్పుడు రకరకాల రుచులు, రంగుల్లో, వివిధ రూపాల్లో సాక్షాత్కరిస్తోంది.

- కొత్త రూపులో సరికొత్త కలర్లతో..
- వేసవి తాపాన్ని తీరుస్తున్న గోలీసోడా
- అందుబాటులో వివిధ రకాల ఫ్లేవర్లు
- ప్లాస్టిక్ సీసాల్లోనూ లభ్యం
- ఆసక్తి చూపుతున్న యువత



గోలీ సోడా తయారీ యూనిట్

తాళ్లరేవు: ఒకప్పుడు గోలీసోడాకు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఇంటికి బంధువులు వచ్చినా, ఏ ఇంట శుభ కార్యక్రమం జరిగినా గోలీసోడా సందడి చేసేది. ఏ ప్రాంతంలోనైనా, ఏ దుకాణంలో నైనా గోలీసోడా ఉండాల్సిందే. ఆర్డినరీ సోడా, నిమ్మసోడా, కలర్ సోడా అంటూ పెద్దఎత్తున విక్రయాలు సాగించేవారు. కొందరైతే చెక్క బండ్లలో సోడాలను మాత్రమే విక్రయిస్తూ జీవనం సాగించేవారు. ముఖ్యంగా వేసవి వచ్చిందంటే చాలు వేసవి తాపాన్ని తీర్చడంలో గోలీసోడా పాత్ర అంతా ఇంతా కాదు. అంతేకాకుండా కడుపారా భుజించి భుక్తాయాసంతో ఉన్న వారికి ఒక్క గోలీసోడా తాగితే చాలు.. అదంతా క్షణాల్లో మాయమయ్యేది. వేసవిలో సోడా తాగనిదే రోజు గడిచేది కాదనడం అతిశయోక్తి కాదు. 1990వ దశకంలో గోలీసోడా ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకుంది. కూల్ డ్రింకులు మార్కెట్‌లో ప్రవేశించాక.. గోలీసోడా క్రమేపీ కనుమరుగవుతూ వచ్చింది.

పాతదే.. కొత్తగా..

కాగా పాత గోలీసోడా కొత్తగా తయారై ఇప్పుడు మార్కెట్‌లో సందడి చేస్తోంది. కొందరికి వచ్చిన ఆలోచనతో పాత గోలీసోడాను కొత్త కలర్ సోడాగా రూపాంతరం చేశారు. కొత్త ఫ్లేవర్లతో, వివిధ రకాల రుచులతో కూల్ డ్రింకులను తలదన్నేలా గోలీసోడాలను తయారు చేస్తున్నారు. అన్ని వర్గాల వారు ఆకర్షించేలా లెమన్, ఆరెంజ్, గ్రేప్, బ్లూబెర్రీ, స్ట్రాబెర్రీ, పైనాపిల్ తదితర రుచుల్లో మార్కెట్లో ప్రవేశపెట్టారు.

ప్లాస్టిక్ సీసాల్లో కూడా..

సోడా అంటే ప్రత్యేక ఆకారం, దిట్టంగా గాజు సీసాతో ఉంటుంది. సోడా తాగిన తర్వాత దానిని దుకాణదారునికి తిరిగి ఇచ్చేయాలి. ప్రస్తుత స్పీడ్ యుగంలో డిస్పోజబుల్ బాటిళ్ల వినియోగం బాగా పెరిగింది. ఈ క్రమంలో గాజు బాటిల్‌తో పాటు, సోడా ఆకారంలో ఉండేలా వివిధ రకాల సైజుల్లో ప్లాస్టిక్ బాటిళ్లను కూడా రూపొందించారు. ప్రయాణాల్లోనూ వినియోగించుకునే విధంగా గోలీసోడాలు అందుబాటులోకి వచ్చాయి. 200, 300 ఎంఎల్‌ల్లో అందుబాటులో రావడంతో వీటి వినియోగం పెరిగింది.

హైజనిక్‌గా తయారీ

మోడరన్ గోలీసోడాను మినరల్ వాటర్‌తో, అత్యాధునిక యంత్రాల సహాయంతో, పూర్తి హైజనిక్‌గా తయారు చేస్తున్నారు. యంత్రంలో పంచదార ద్రావణం, వివిధ రకాల ఫ్లేవర్లతో మిళితం చేసి గోలీ సోడాలను చేస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల అనుమతులతో అత్యంత హైజనిక్‌గా వీటిని రూపొందిస్తున్నారు.



ప్లాస్టిక్ సీసాల్లో అందుబాటులోకి వచ్చిన గోలీసోడాలు



గోలీసోడాకు ఆదరణ పెరిగింది

కొత్తగా వచ్చిన గోలీసోడాకు ప్రజల నుంచి విశేష ఆదరణ పెరిగింది. అందుకు తగ్గట్టుగా వివిధ రకాల రుచుల్లో సోడాలను తయారు చేసి విక్రయిస్తున్నాం. ముఖ్యంగా డిస్పోజబుల్ గోలీసోడాలకు మంచి గిరాకీ ఉంది. అత్యంత హైజనిక్‌గా సోడాలను తయారు చేస్తున్నాం.

– ఎల్.వెంకటేష్, గోలీసోడా తయారీదారుడు



చాలా రుచిగా ఉంటున్నాయి

వివిధ రకాల ఫ్లేవర్లలో లభిస్తున్న గోలీసోడాలు చాలా రుచిగా ఉంటున్నాయి. ముఖ్యంగా ఎండలో తాగితే దాహం తీరి సేదతీరినట్టుంటుంది. మార్కెట్‌లో లభిస్తున్న కూల్‌డ్రింకులకు భిన్నంగా గోలీసోడాలు ఉండడంతో ఎక్కువగా వీటినే తాగుతున్నాం.

– గోపి ప్రసాద్, పి.మల్లవరం

వైభవంగా కామాక్షి విగ్రహ పునః ప్రతిష్ఠ



కామాక్షీదేవి పాలరాతి పునః ప్రతిష్ఠ క్రతువును నిర్వహిస్తున్న కామేశ మహర్షి

అమలాపురం టౌన్: కామాక్షీ పీఠం మహా సంస్థానంలో కామాక్షి పాలరాతి విగ్రహ పునః ప్రాణ ప్రతిష్ఠ శుక్రవారం ఉదయం 7.11 గంటలకు శాస్త్రోక్తంగా జరిగింది. పీఠాధిపతి కామేశ మహర్షి యంత్ర స్థాపన చేసి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పీఠంలో కొలువైన కామాక్షీదేవి పాత విగ్రహం స్థానే రాజస్థాన్ రాష్ట్రం నుంచి రప్పించిన పాలరాతి విగ్రహాన్ని వందలాది భక్తుల సమక్షంలో వైభవంగా ప్రతిష్ఠించారు. పీఠం ఉత్తరాధికారి బాల బ్రహ్మచారి విఘసన రాఖీ ప్రేమ్ శిఖరానికి యంత్ర స్థాపన, శిఖర ప్రతిష్ఠ చేశారు. అనంతరం మహా కుంభాభిషేకం జరిగింది. హైదరాబాద్‌కు చెందిన కోదండపాణి వైద్యనాథన్, నాగమహేశ్వరి దంపతులు, గుండా శ్రీధర్, రాధిక దంపతులు ఈ పాలరాతి విగ్రహాన్ని సమకూర్చారు. పీఠాధిపతి కామేశ మహర్షి పర్యవేక్షణలో పీఠం బ్రహ్మ గోవిందవఝల నాగభాస్కరశర్మ యాజ్ఞికంలో ఆయన శిష్య బృందం సహకారంతో జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం తదితర పూజా ప్రక్రియ జరిగాయి. శిఖర ప్రతిష్ఠ అనంతరం భక్తులు బూరెలను శిఖరం పై నుంచి భక్తితో వదిలారు.

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం



పేరూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి విశ్వరూప్, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి

ఎన్నికల ప్రచారంలో మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: రాష్ట్రంలో సంక్షేమ పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రూరల్ మండలం పేరూరు వై.జంక్షన్‌లో పార్టీ నేతలతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వందలాది పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్నికల ప్రచార రథంపై నుంచి విశ్వరూప్, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి ప్రజలకు అభివాదం చేశారు, విశ్వరూప్ ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆయనకు మహిళలు హారతులిచ్చి నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా విశ్వరూప్ మాట్లాడుతూ ప్రత్యక్ష రాజకీయాలలో ఏడోసారి పోటీ చేస్తున్న తాను ఈ రకమైన ప్రజా స్పందన ఎప్పుడూ చూడలేదన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం, తన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఏఎంసీ చైర్మన్ దంగేటి డొలమణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, పార్టీ మండల అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, సర్పంచ్ దాసరి అరుణ, ఎంపీటీసీలు చొల్లంగి సుబ్బిరామ్, దొంగ ఆంజనేయులు, వాసంశెట్టి శ్రీను, ఉప సర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, పార్టీ నాయకులు సూదా గణపతి, ఇళ్ల ఏడుకొండలు, మోటూరి సత్యనారాయణ, సరేళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును నమ్మితే ముంచేస్తాడు

ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్



కొమరగిరిలో మాదిగలతో సమావేశమైన ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

ఐ.పోలవరం: టీడీపీ అధినేత చంద్రబాబుని నమ్మితే నట్టేట ముంచేస్తాడని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. కొమరగిరిలో శుక్రవారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, సీనియర్ నాయకులు పితాని బాలకృష్ణ, బొమ్మి ఇజ్రాయిల్ గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఉన్న ఎమ్మార్పీఎస్ నాయకులను, మాదిగ యువకులను, మహిళలను సమీకరించి ఎన్నికల ప్రచారంలో భాగస్వామ్యం చేశారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ మాట్లాడుతూ ఎవరెన్ని జతలు కట్టినా, ఎన్ని కల్లబొల్లి మాటలు చెప్పినా మాదిగ సోదరులు చంద్రబాబును నమ్మే ప్రసక్తి లేదన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామన్నారు. అందుకు రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీధి శేఖర్‌బాబు, బడుగు శ్రీను, లంక ఏడుకొండలు, శాంతకుమారి, జొన్నాడ అజయ్, వీధి రవి, ఉందుర్తి ఈశ్వరిబాయి, ఆకుమర్తి కృష్ణ, లంక సతీష్ కుమార్ తదితరులు ఉన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



కేశనకుర్రులో మూకుమ్మడి రాజీనామాలు చేసిన వలంటీర్లు

ఐ.పోలవరం: సంక్షేమ సారథులుగా ప్రజల మన్ననలు అందుకుంటున్న వలంటీర్లపై ప్రతిపక్ష పార్టీలు అవలంబిస్తున్న నిరంకుశ వైఖరిని నిరసిస్తూ మండలంలోని కేశనకుర్రు గ్రామ సచివాలయాల్లో 57 మంది వలంటీర్లు, కొమరగిరిలో 13 మంది శుక్రవారం మూకుమ్మడి రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను సిబ్బందికి అందజేశారు. వారు మాట్లాడుతూ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి తమ వంతుగా పనిచేస్తామని, అందుకే మూకుమ్మడి రాజీనామాలు చేసినట్టు తెలిపారు.

ఓటు వినియోగంపై సైకిల్ ప్రచారం



రామసుబ్రహ్మణ్యం సైకిల్ ప్రచారాన్ని ప్రారంభించిన ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: అందరం ఓటేద్దాం.. వంద శాతం పోలింగ్.. మై ఓట్ మై రైట్ అంటూ సైకిల్‌పై ఒంటరిగా పుదుచ్చేరి వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నారు కేంద్రీయ విద్యాలయలో పనిచేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు రామసుబ్రహ్మణ్యం. పుదుచ్చేరి ఏకైక లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి ఈ నెల 19న ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. శుక్రవారం ఆయన సైకిల్‌పై ప్లకార్డులు పెట్టుకుని చేస్తున్న ప్రచారాన్ని స్థానిక ఆర్‌ఏఓ ఆఫీసు వద్ద రీజినల్ అడ్మినిస్ట్రేటర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వందశాతం పోలింగ్ జరగాలని, ఓటును తన హక్కుగా భావించాలని చెప్పారు. ఓటును వినియోగించుకోకుండా, ఇంటి వద్దే ఉండిపోయే వారిలో చైతన్యాన్ని తీసుకురావడానికి ఈ ప్రయత్నం చేస్తున్నానన్నారు. ఇప్పటికే పుదుచ్చేరి పూర్తయ్యిందని, యానాం వచ్చానని, అనంతరం కారైకల్ వెళ్లనున్నట్టు తెలిపారు.

జగన్‌తో పేదల జీవితాల్లో వెలుగులు

వైఎస్సార్ సీపీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



కొమరగిరిలో ఎన్నికల ప్రచారంలో పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, పితాని బాలకృష్ణ తదితరులు

ఐ.పోలవరం: కుల, మత, పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం కొమరగిరి జాంబవానిపేటలో ఆయన, సీనియర్ నాయకుడు పితాని బాలకృష్ణ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలసి ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పొన్నాడ మాట్లాడుతూ జగన్ సంక్షేమ పథకాలను కొనసాగిస్తానంటూ చంద్రబాబు ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నాడని, ప్రజలు నమ్మ వద్దని కోరారు. ప్రస్తుత పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని చెప్పారు. గ్రామంలో జాంబవానిపేట, కోలావారి మెరక, రామాలయం పేట, గట్టువారిపేట, వీర్రాజు చెరువు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, ఢిల్లీ నారాయణ, కాశి బాలమునికుమారి, ఏలూరి ఆదినారాయణ, సఖిలే వెంకటేశ్వరావు, తోట వెంకటేశ్వరావు, పెన్మత్స వాసురాజు, విత్తనాల శ్రీనివాసరావు, ఉందుర్తి ఈశ్వరిబాయి. పెమ్మాడి బాబూరావు, వి.సుసీంద్రరావు, తదితరులు ఉన్నారు.

50 మంది పరీక్ష రాస్తే.. 8 మంది పాస్

- బోధించేది 15 మంది అధ్యాపకులు
- ఫలితాలపై తల్లిదండ్రుల ఆందోళన

యానాం: యానాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విడుదలైన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో 16 శాతం పాస్ పర్సంటేజ్ నమోదు కావడంపై పలువురు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏటేటా ఫలితాలు దిగజారడం పై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ద్వితీయ ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులు కలిపి మొత్తం 50 మంది పరీక్షకు హాజరైతే, కేవలం 8 మంది మాత్రమే పాస్ కావడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ కళాశాలలో 15 మంది అధ్యాపకులు విధులు నిర్వహిస్తుండటంతో పాటు, ప్రభుత్వం ప్రతి నెలా లక్షలాది రూపాయల మేర బడ్జెట్ కేటాయిస్తోంది. విధినిర్వహణలో అధ్యాపకుల అలసత్వం కారణంగానే ఇలాంటి ఫలితాలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేస్తున్నారు.

2016 నుంచీ..

ముఖ్యంగా 2016 నుంచి కళాశాలలో ఇంటర్ ఉత్తీర్ణతా శాతం దిగజారుతోంది. 2016–17లో ఫస్టియర్ 27.3 శాతం, సెకండియర్ 35.57 శాతం, 2017–18లో ఫస్టియర్ 21.2, సెకండియర్ 46, 2018–19లో ఫస్టియర్ 22.71, సెకండియర్ 47.81, 2019–20లో కేవలం 26 శాతం మాత్రమే ఉత్తీర్ణత పొందారు.

ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు

పి.గన్నవరం: ఎన్నికల్లో పాల్గొనే దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించడంతో పాటు, వారికి ఉపయోగపడేలా యాప్‌ను ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిందని జిల్లా దివ్యాంగుల ఎన్నికల నోడల్ అధికారి బీవీ రమణ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి దివ్యాంగులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, జిల్లాలో నూరు శాతం దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. విభిన్న ప్రతిభావంతుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల అభిప్రాయాలను తెలుసుకున్నారు. దివ్యాంగుల కోసం అన్ని పోలింగ్ కేంద్రాలను గ్రౌండ్ ఫ్లోర్లలోనే ఏర్పాటు చేసినట్టు వివరించారు. వీరికోసం ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా రూపొందించిన సాక్షం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. 85 ఏళ్లు దాటిన, నడవలేని స్థితిలో మంచానికే పరిమితమైన వారు, నడవలేని దివ్యాంగులు హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

400 మంది వైఎస్సార్ సీపీలో చేరిక



గండివారిపాలెంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న పితాని బాలకృష్ణ తదితరులు

తాళ్లరేవు: జి.వేమవరం పంచాయతీ గండివారిపాలెం గ్రామానికి చెందిన సుమారు 400 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పితాని బాలకృష్ణ సమక్షంలో వారంతా పార్టీలో చేరారు. జనసేన, టీడీపీకి చెందిన వీరికి బాలకృష్ణ వైఎస్సార్ సీపీ కండువాలు వేసి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ ముమ్మిడివరం నియోజకవర్గ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కాద గోవిందకుమార్, శెట్టిబలిజ నాయకులు రెడ్డి సతీష్, బొంతు మోహన్, పంపన రామకృష్ణ, మట్టపర్తి లోవరాజు, కొప్పిశెట్టి వెంకట్, పితాని సత్తిబాబు, పంపన సూరిబాబు, కట్టా దుర్గారావు, కాలా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో 992 మార్కులతో మధురిక ప్రతిభ



కుమార్తె మధురికను అభినందిస్తున్న తల్లిదండ్రులు

అమలాపురం టౌన్: అమలాపురం ఏవీఆర్ నగర్‌కు చెందిన ఆకుల వెంకట దుర్గా మధురిక ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ప్రతిభ చాటింది. వెయ్యి మార్కులకు గాను 992 సాధించి సత్తా చాటింది. మధురిక తల్లిదండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులు కావడంతో కుమార్తెకు అదే స్థాయిలో సూచనలిచ్చి చదివించారు. తండ్రి బాల బసవేశ్వరరావు అమలాపురం రూరల్ మండలం సాకుర్రుగరువు మండల ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్నారు. తల్లి సుభాషిణి అల్లవరం మండలం బోడసకుర్రు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. మధురిక విజయవాడలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్మీడియట్ రెండేళ్లు చదివింది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన తమ కుమార్తె మధురికను తల్లిదండ్రులు అభినందించారు. ఇటీవల జరిగిన జేఈఈ మెయిన్స్‌లో మధురిక 99.7 శాతంతో ఉత్తీర్ణత సాధించింది.

పార్టీల ఎన్నికల ప్రచార హోరు



కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వైథిలింగంకు మద్దతుగా కాంగ్రెస్ నేతల ప్రచారం

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి ఈ నెల 19న ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో యానాంలో వివిధ పార్టీల ప్రచారం ఊపందుకుంది. ప్రచారానికి కేవలం ఐదు రోజులు మాత్రమే గడువు ఉండటంతో ఆయా పార్టీలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ప్రధాన పార్టీలైన బీజేపీ, ఎన్ఆర్‌కాంగ్రెస్ కూటమి, కాంగ్రెస్ పార్టీ మధ్యే ప్రధాన పోరు జరగనుండటంతో ఆయా పార్టీల అభ్యర్థులు పుదుచ్చేరి నుంచి వచ్చి ఇప్పటికే తమ యానాం ప్రచారాన్ని పూర్తి చేశారు. వారం రోజుల క్రితం కాంగ్రెస్ అభ్యర్థి వైథిలింగం తన యానాం ప్రచారం విస్తృతంగా నిర్వహించారు. అనంతరం గురువారం బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి అభ్యర్థి నమశ్శివాయంతో పాటు, సీఎం రంగసామి తదితరులు యానాంలో ప్రచారాన్ని నిర్వహించారు. ఎన్డీయే కూటమి అభ్యర్థికి మద్దతుగా ఇండిపెండెంట్ ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ కలిసి ఇప్పటికే బహిరంగ సభను నిర్వహించారు. అదేవిధంగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సైతం ఎన్డీయే కూటమి అభ్యర్థికి మద్దతుగా బైక్ ర్యాలీని నిర్వహించారు. స్థానికంగా కాంగ్రెస్‌కు మద్దతుగా ఇన్‌చార్జి మల్లాడి సత్తిబాబు, ఇండిపెండెట్‌గా బరిలో నిలిచిన అరదాడి పోసియ్య తన గెలుపు కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. పుదుచ్చేరిలో చిట్టచివరి 30వ నియోజకవర్గం కావడం అత్యధికంగా 39 వేల మంది ఓటర్లు ఉండటంతో, ఈ నియోజకవర్గ ఓట్లు అభ్యర్థి గెలుపోటములను శాసిస్తున్నాయి. అభ్యర్థులు ఆ దిశగా ప్రచారానికి ప్రాధాన్యమిచ్చారు.